పోతావ్! నేను వచ్చేదాకా ఇక్కడే వుండాలి" అన్నాడు ప్రసాదు.

"ఎక్కడికీ వెళ్ళను" అని రామం వాగ్దానం చేయగానే, వాడు వెనక్కిచూస్తూ, "పోవాను!" అని అరుస్తూ దొడ్లోకి పరుగెత్తాడు.

"ఇదేసమయం!" అని గబగబా బజార్లోకి వెళ్ళాడు రామం. నాలుగడుగులు వేశాడో లేదో పొరుగింటి వితంతువు బుచ్చెమ్మగారు దొర్లుకుంటూ ఎదురుగా వచ్చారు. రామం అదిరి పడి, ముందుకు ఒక్క అడుగు కూడా సాగక, గిరుక్కున వెనక్కితిరిగి యింటికివచ్చాడు. చొక్కా కూడా తొడుక్కోకుండా వస్తున్నాడు తమ్ముడు. ఇక ప్రయాణం కట్టిపెట్టి, ఆ వారం ఫలితాలేం ఉన్నాయో ఒకసారి పత్రికలో చూద్దామని ఆలోచిస్తూ యింట్లో ప్రవేశించాడు.

పేపర్లన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. వెధవ! ఆ ప్రసాద్ గాడిదే యీపని!. వీడితో చెడ్డ చిక్కుగా వుంది. ఎక్కడికీ బయలుదేరనీయడు. వెంటపడ్డాడంటే ఇక వదలడు. అయినా వీడికి పేపర్లతో యేంపని వచ్చింది? నాలుగంటిస్తేసరి. అంటిస్తే, అమ్మ ఊరుకుంటుందా? వాడినే వెనకేసుకువచ్చి నాలుగువడ్డిస్తుంది! ఆవిడేవాణ్ణి అలా తుంటరిగా తయారు చేస్తోంది! వెధవ! వాణ్ణి తలుచుకుంటేనే వళ్లు మండిపోతున్నది. అయినా కోపాన్నంతా దిగమ్రింగి, పేపర్లుతీసి వరుసగా సర్దటానికి ఉపక్రమించాడు రామం.

క్రిందటి ఆదివారం పేపరుకోసం వెదుకుతూ పేపర్లు సర్దుతున్న రామం చేతికేదో కుట్టింది. గబాలున చేతిని విదలుస్తూ, పేపరు గిరవాటేశాడు. పేపర్లోంచి టపీమని ఒక ఎర్రతేలు క్రింద పడింది! కోపంతో కసితీరేట్లు చెప్పుకాలితో ఒక్క తొక్కుతొక్కాడు. చేయి పోటు మొదలు పెట్టింది. చేతిని పట్టుకుని మూల్గసాగాడు.

ఈ లోగా అమ్మా, ప్రసాదూ చరచరా పరుగెత్తుకుంటూ వచ్చారు "ఏమిటిరా!" అంటూ.

"అన్నయ్యకు తేలుకుట్టిందే"అన్నాడు ప్రసాదు క్రింద చచ్చిపడివున్న తేలును చూపిస్తూ.

"ఎక్కడ కుట్టిందిరా?...పద—బుచ్చెమ్మగారు మంత్రం పెట్టారు"అంది దుర్గమ్మగారు.

"అబ్బ...వుండవే! ఆ బుచ్చెమ్మ మొహం చూస్తేనే యింత జరిగింది! నేను రాను"అన్నాడు యేడుపుమొహంతో రామం.

"అదేమిటిరా, ఆవిడేంచేసింది...?"అని దీర్ఘం తీసింది దుర్గమ్మ.

"అదికాదే! అన్నయ్య ఎక్కడికో పోతుంటే బుచ్చెమ్మగారు ఎదురువచ్చిందే"అన్నాడు ప్రసాదు అసలు విషయం వివరిస్తూ.

"అబ్బబ్బ...బ్బ...ఊఁ...యిస్స్...నొప్పే.. అయ్యో...అమ్మా...!"

పాపం, రామం బాధకు తాళలేకపోయాడు. దుర్గమ్మగారు ప్రక్కింటి రామయ్యగారిని పిలిచి, తేలుమందు వేయించింది; కొంతసేపటికి బాధ తగ్గింది రామానికి.

అతనికి మరీ పట్టుదల ఎక్కువైంది— ఆ వారం ఫలితాలు చూడాలని. ఆదివారం పేపరుతీసి చదవ సాగాడు.

"క్రొత్తవారితో పరిచయం. పరీక్షా ఫలితాలలో లాభం. నాలుగు, అయిదు తారీకుల్లో ప్రయాణం, శుభవార్త. విష జంతువులవల్ల బాధ, వారాంతంలో మనస్సును కలతపెట్టే విషయాలు."

"అంతా అక్షరాలా నిజం!" అనుకున్నాడు. జాగ్రత్తగా వుండాలి. ఈ ఒక్కరోజు గడచిపోతే తెల్లవారితే క్రొత్త వారఫలితాలు!

ఆ సాయంకాల సినిమానించివచ్చి భోంచేస్తానని ఇంట్లో చెప్పి, సినిమాకు బయలుదేరాడు రామం. హాలుదగ్గరకుచేరి, యింకా టైమ్‌ఉండడం వల్ల అటూయిటూ తిరుగసాగాడు.

ఇంతలో ఒక పల్లెటూరి పడుచు అతణ్ణి సమీపించి— "ఇదుగో, అబ్బాయా!...ఏం సెనిమా ఆడుతోంది?"అని అడిగింది.

రామం మామూలుగా, "వుయ్ టూ" అని యింగ్లీషులోచెప్పాడు. ఆమె అర్థంకాక"అంటే?" అంది.

"మనమిద్దరం!"అన్నాడు రామం.

కస్సుమంటూ లేచిందావిడ. "ఏమంటున్నావ్? మనం యిద్దరమా?...ఏంకూతయ్యా అది?" అంటూ బిగ్గరగా అరుపుమొదలుపెట్టింది.

నలుగురూ చేరారు; "ఏమిటి,ఏమిటి?"అంటూ.

"మనమిద్దరం" సినిమా పేరని చెపుదామనుకున్నాడు రామం. కాని నోటమాట రానిస్తేగా!

ఆవిడ నోటికొచ్చినట్లు తిట్టసాగింది. అందరితో చెప్పుకుంది—"చూడండయ్యా! పల్లెటూరివాళ్ళమైతే మటుకు మాకూ నీతి వుంటది! చదువురాక యేమి సినిమా వున్నదయ్యా అని అడిగితే-మనమిద్దరంట" అంటూ సాగించింది.

అంతా పగలబడి నవ్వసాగారు. ఆవిడ తెల్లబోయింది. రామం తలవంచుకున్నాడు. వాళ్ళలో ఒకడు నెమ్మదిగా, "మనమిద్దరం" అనేది సినిమా పేరని ఆవిడకు వివరించిచెప్పాడు. ఆవిడ, "అదా! నాకు తెలీలేదే..." అంటూ సాగిపోయింది. అంతా మళ్ళీ గొల్లున నవ్వారు. రామం తలవంచుకుని చల్లగా జారుకున్నాడు.

మనస్సంతా పాడయింది. పాడుసినిమా! ఎంత రభసచేసింది! "వారాంతంలో మనస్సును చీకాకు పరిచే విషయాలు" వారఫలాలు గుర్తువచ్చాయి. ఉదయం పిల్లిశకునం గుర్తువచ్చింది. దాని ఫలితమే యిదంతా!

ఆ రోజు నిద్రలేచిన మొదలు అప్పటివరకు జరిగిన విషయాలు గుర్తుతెచ్చుకుంటూ పరాకుగా ఇంట్లో ప్రవేశించాడు రామం.

ఇంట్లో కాలు పెట్టాడో లేదో గభాలుమని పెద్ద శబ్దంతో కుర్చీ, లాంతరు క్రిందపడ్డాయి. కాలికి దెబ్బతగిలింది! కుర్చీ దారికడ్డంగావుంది కాబోలు! అంతా చీకటిగావుంది. కుర్చీతగలనూ, "బోర్లబొక్కలు"గా పడనూ! రామం ఆ కుర్చీ మీద పడ్డాడు.

ఆ ధ్వనికి యింట్లోవాళ్ళంతా పరుగెత్తుకుంటూ వచ్చారు దీపాలతో.

"ఏంజరిగిందిరా నాయనా? దెబ్బ తగిలిందా? దీపం ఏమైంది?" అనీ, "సినిమాకి వెళ్ళలేదా"? అనీ పరామర్శించారు.

"సినిమాలేదూ గినిమాలేదు. దీపం ఉందోలేదో చూడనక్కర్లేదూ?" అన్నాడు కోపంతో.

"చిన్న వెధవ ప్రసాదు ఆర్పేశాడు కామాలు!" అంది దుర్గమ్మగారు, కుర్చీతీసి సరిగా పెడ్తూ.

"దారికడ్డంగా ఈ కుర్చీయేమిటి? నేను కాబట్టి సరిపోయింది. ఎవరైనా క్రొత్తవాళ్ళొచ్చినా ఇంతేగా?" అన్నాడు రామం.

"ఇదీ వాడిపనే!" అన్నది అమ్మ.

"ఎవరి పనీకాదు ఇదంతా శకున ఫలితం!" అన్నాడు రామం విసుగుతో.

"ఏమిట్రా? శకున ఫలితమేమిటి? ఏమిటే! ఏం జరిగింది?" అంటూ లోపల ప్రవేశించారు నరసింహంగారు.

"అరె! నాన్నగారు వచ్చారే!...ఎప్పుడొచ్చారు? అక్కా, బావా కులాసాగావున్నారా? మోహన్ బాగా అల్లరిచేస్తున్నాడా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు రామం.

"అంతా బాగానేవున్నారు. అది సరే, ఏమి జరిగింది?అంతావిసుక్కుంటున్నారు?" అన్నారాయన.

రామం ప్రొద్దున పిల్లిమొహం చూడడం మొదలు జరిగిన అవమానాలన్నీ పూసగ్రుచ్చినట్లు చెప్పాడు—వారఫలాలతో సహా!

నరసింహంగారు చిరునవ్వుతో. "నీమొహం! పిల్లిని తిడతావెందుకురా? అది నీకు ప్రొద్దున్నే చెప్పింది ఒకపాఠం. ఏమని? జాగ్రత్తగా మెసలుకోమని! అదినీకు చేతకాక దాన్ని తిడ్తావెందుకు!" అన్నారు.

ఆమాటలు రామానికి నచ్చినట్లులేదు. ఆయన మళ్ళీ చెప్పసాగాడు. "చూడు, రామం, ఒక పని మీద బయలుదేరావనుకో. పిల్లి యెదురువచ్చింది! దాన్ని తిట్టి, కాళ్ళుకడుక్కుని, మళ్ళీ మంచిశకునం చూసుకుని ప్రయాణమైవెళ్ళి, తిరిగివచ్చిన తరువాత ఆపని కాలేదు, డబ్బుమాత్రం వదిలింది-అంటూ విసుక్కోవడం దేనికి? అసలు ఆ పిల్లిముందే నీకు చెప్పింది. డబ్బుదండగ, వెళ్ళవద్దూ, అని! ఆ మాట వింటే యిక అంతడబ్బు దండగ ఎందుకవుతుంది? కనుక, శకునంఅంటే ఒక హెచ్చరిక!" అన్నారు నరసింహంగారు.

అంతా భోజనాలకు కూర్చుంటున్నారు. రామం పీటమీద కూర్చోబోతుంటే నరసింహంగారన్నారు: "నెమ్మదిగా కూర్చుని, నింపాదిగా భోజనం చెయ్యవోయ్. పీటజారినా, కొరపోయినా, అదికూడా శకునఫలమే అంటావు!" అని! అమ్మా, తమ్ముడు, అంతా నవ్వారు.

రామం ఆరాత్రి సరస్వతీదేవి పటంతెచ్చి మంచం పక్కనే వుంచుకు పడుకున్నాడు. తెల్లవారగానే లేచి ముందు ఆదేవిపటంచూస్తే శుభం అనుకుంటూ, ఆరోజు విషయాలను మఱచిపోవాలని ప్రయత్నిస్తూ, నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు. ★